# బొమ్మా - బొరుసూ

శాంతి ఏడుస్తోంది. ముక్కు తుడుచుకొంది పయట కొంగుతో. అదే నడుమున బిగించి పాత్రలు కడగటానికా అన్నట్టు సింక్ దగ్గరకు వెళ్ళింది.

"ఆ పని అలా ఉంచు. నిజంగా జరిగిందేమిటో వివరంగా నాకు చెప్పు" అన్నాను.

"ఇంకా చెప్పటానికి ఏముందమ్మా. ఇంతపని జరిగిన తర్వాత ఈ ఇంట్లో ఉండాలంటే భయమవుతోంది."

నేను శాంతి కళ్ళలోకి సూటిగా చూశాను. తనూ బెరుకుగా చూచి రెప్పలు వాల్చింది. కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

"మీరేం బాధపడకండి. ఇటువంటివి అందరిళ్ళలో జరిగేవే. కానీ మీ అండ చూసుకొనే నేనిక్కడ పనికి ఒప్పుకొన్నాను" అంది శాంతి.

నేను బాధపడుతున్నానా? కోపాన్ని అణచుకొంటున్నానా? అసహ్యాన్ని దూరంగా ఉంచుతున్నానా? చెప్పటం కష్టం. అయినా నెమ్మదిగా అన్నాను. "నువ్వు నిజమే చెబుతున్నావు కదూ."

"సరే మీరు నమ్మకపోతే నేను నిజం చెప్పినా అబద్ధం చెప్పినా ఒకటే. అసలు మీకు ఈ మాట చెప్పటమే బుద్ధి తక్కువ. ఇప్పుడూ నాకై నేను చెప్పలేదు. మీరే మరీ మరీ అడిగారు. అలా ఉన్నావేం శాంతీ అని. ఇక చెప్పక తప్పలేదు."

బాబు లేచినట్లున్నాడు. పాలు పట్టటానికి పాలసీసా తీసుకొంది శాంతి. "అదలా ఉంచు. నేను చూసుకొంటానులే. నువ్విప్పుడే వెళ్ళిపో."

తెల్లబోయింది.

"ఎక్కడికి?"

"మీ ఇంటికి"

"అదేమిటి?"

"అదంతే నువ్వు వెళ్ళిపో"

"మీకు కష్టమవుతుందేమో..."

"మరేం పర్వాలేదు. వెళ్ళిపో నీ సామాన్లు తెచ్చుకో."

శాంతి అక్కడే నిలబడింది.

"వద్దు. ఇక నువ్విక్కడ ఉండొద్దు. ఇదిగో ఈ ఐదు వందలూ ఉంచుకో. మీ ఊరెళ్ళుతావో ఇంకెక్కడయినా పనికి కుదురుతావో, మీ పిన్ని ఇంటికి వెళ్తావో నీ ఇష్టం. నేను బాబుకు పాలు పట్టే లోపుగా నీవు వెళ్ళిపోవాలి. నాకు తిరిగి చెప్పనక్కరలేదు."

శాంతి కాస్సేపు తటపటాయించింది. డబ్బు చేతిలో పట్టుకొని సంకోచిస్తూ నా కళ్ళలోకి చూసింది. తర్వాత వెళ్ళిపోయింది. తను పెట్టె సర్దుకోటం, సామాను బయట పెట్టటం. ఆ తర్వాత తలుపు వెయ్యటం తెలుస్తూనే ఉంది.

బాబు మళ్ళీ నిద్రలోకి జారుకొన్నాడు. అప్పుడు లేచి మెట్లెక్కి శాంతి ఇంతకు ముందున్న గదిలోకి వెళ్ళాను. అంతా ఖాళీగా ఉంది. తను వెళ్ళిపోయింది. మంచిదే అయింది. ఇటువంటి పరిస్థితులలో తను ఇక్కడ ఉండక పోవటమే మంచిది.

ఇంకా పదిరోజులు కాలేజికి సెలవులే గనుక నేను బాబును చూసుకోగలను. కాలేజి తెరచిన తర్వాతే సమస్య. ఇంటిపనులు చేసి పెట్టటానికి పని వాళ్ళను కుదుర్చుకోటం అంత కష్టమేం కాదు. కానీ రోజంతా ఇంటిలో ఉండి, ఇంటి మనిషిలా మెదిలే వాళ్ళు కుదరటం కష్టం. పట్టణాలలో చిన్న చిన్న కుటుంబాలలో ఉంటూ భార్యాభర్తలిద్దరూ పనిచేసుకొంటున్నప్పుడు పిల్లల పెంపకం కష్టమే అవుతుంది. ఇంట్లో ఎవరో ఒకరు ఉండక తప్పదు. మా బాబు పాకుతుంటాడు. ఏది కనిపిస్తే అది నోట్లో పెట్టుకొంటాడు. ప్రతి దాంట్లోనూ వేలు పెట్టుంటాడు. అందుకే ఒక్క క్షణం కనుమరుగు కాకుండా చూసుకోవలసి వస్తోంది.

బాబు పుట్టాక తిరిగి ఉద్యోగంలో చేరే సమయానికి బాబును చూసుకోటానికి ఒక మనిషి కావలసి వచ్చింది. ఎంతో వెతగ్గా, వెతగ్గా, చివరకు శాంతి పనికి కుదిరింది. మాకు తెలిసిన వాళ్ళింట్లో శాంతి పిన్నమ్మ పని చేస్తోంది. తనే శాంతిని ఊరినుండి పిలిపించింది. తను చేరి నాలుగు నెలలయింది. బాగానే పనిచేస్తోంది. బాబును శ్రద్ధగానే చూస్తోంది. కానీ తను ఈనాడు చెప్పినమాట!

"ఓ రవీ! రవీ! వాట్ ఎ ఫాల్!"

నా పిడికిళ్ళు మూసుకొన్నాయి. పళ్ళు బిగించి నన్ను నేను అదుపులో పెట్టుకోటానికి ప్రయత్నించాను.

ఇప్పుడు నేనింకో మనిషిని వెతుక్కోక తప్పదు. ఆడ మనిషే అవసరమవుతుంది. ఏ వయసులో ఉంటుందో, ఎటువంటి సమస్యలొస్తాయో! ఇంతకూ నన్నీ ఇరకాటంలో పెట్టిన ...ఛీ ...ఛీ .. తలచుకొంటేనే జలదరింపుగా ఉంది. కానీ అది నిజమా? ఎవరేది చెప్పినా నమ్మేయటమేనా? నాకు రవి ఎనిమిదేళ్ళుగా తెలుసు. మా వివాహ జీవితంలో ఐదేళ్ళు గడిచాయి. కాని ఈ రోజు శాంతి చెప్పిన రవి నాకు తెలీదు. అసలది అతని సంస్కారంలోనే లేదు. మరి శాంతి అబద్ధాలెందుకు చెబుతుంది? ఇటువంటి విషయాలలో, అందులో ఆడది, ఎందుకు అబద్ధం చెబుతుంది?

ఆ సాయంత్రం రవిరాగానే "శాంతీ, టీ తీసుకురా" అంటూ తన గదిలోకి వెళ్ళి పోయాడు. అది మాములే. పనులన్నీ శాంతే చూస్తుంది. అందులో విడ్డూరం ఏమీలేదు. కానీ ఈనాడు రవి పిలుపులో నాకేదో మార్దవత్వం వినిపించింది.

నేను టీ కప్పుతో వెళ్ళగానే, "శాంతి ఏదీ? నువ్వు తెచ్చావే" అని అడిగాడు. నేనేమీ మాట్లాడకుండా వచ్చేస్తుంటే నా చెయ్యి పట్టుకు ఆపాడు.

"కాస్సేపు కూర్చో. బాబు నిద్రపోతున్నాడేమో కదా. నువ్వేం చెయ్యాలి?"

"వంట..."

"వాట్ ఎ జోక్!" అంటూ పెద్దగా నవ్వాడు.

"వంట చేయటంలో జోకేముంది?"

"నువ్వు పుస్తకాల పురుగువి. నీకూ వంటింటికీ చాలాదూరం. అవసరం ముంచుకొస్తే గాక దాని జోలికి పోవు. అందులో శాంతి ఉండగా నిన్ను ఆ దరిదాపుల్లోకి కూడా రానివ్వదు."

"అంత భరోసానా శాంతి మీద?"

"నీకు మాత్రం భరోసా లేదా?"

"ఉంది" అంటూ లేచాను.

"ఇదేమిటి నాకంపెనీ నీకు పట్టనట్టుంది ఈ రోజు" అన్నాడు నవ్వుతూ.

నేను పరిశీలనగా రవికళ్ళలోకి చూశాను. అవి నిర్మలంగా నవ్వుతున్నాయి. ఈ రవి, నా రవి... అది సాధ్యమా? ఏమో, మానవ నైజం గురించి ఏమి చెప్పగలం? ఏ క్షణంలో ఏ బలహీనత లొంగదీసుకొంటుందో ఎవరికి తెలుసు?

రవి టీ తాగి కాస్సేపు పేపర్లూ అవీ చూస్తూ టి.వి. ముందు కూర్చున్నాడు. భోజనాలప్పుడు డైనింగ్ టేబిల్ దగ్గర కూడా ఏమీ మాట్లాడలేదు. ఈ టెలివిజన్ కాదు కాని భోజనాల టయిమప్పుడు ఏమి తింటున్నామో కూడా తెలియని స్థితిలో ఉంటున్నాము. కుటుంబంలో సంబంధాలమీద దీని ప్రభావం ఉంటుందని ఊరికే అనలేదు. రాత్రి పడుకొనేముందూ ఏమీ మాట్లాడలేదు. అసలు ఏదో చదువుతూ నేనే ముందు నిద్రపోయాను. తను అప్పటికి ఇంకా టి.వి. చూస్తూనే ఉన్నాడు.

ఏ అర్ధరాత్రో తను తట్టి తట్టి లేపుతుంటే మెలుకువ వచ్చింది. "బాబు" అంటూ గాభరాగా లేచాను.

"బాబు నిద్రపోతున్నాడు. మరేం పర్వాలేదు ఇంతకూ నిద్దట్లో ఆ కేకలు, కలవరింతలు ఏమిటి? ఏమయింది? పీడకలా?"

అస్పష్టంగా ఏదో గొణిగాను.

"ఇవిగో మంచినీళ్ళు".

మంచినీళ్ళు తాగి పడుకొన్నాను. నాకు అభయమిస్తున్నట్లు తన చేయి బరువుగా నా మీద ఉంది. తను నిద్రలోకి జారుకొన్నాడు. కాని నాకు జాగారమే.

మరునాడు నాకంటే తనే ముందులేచాడు. చిన్న చిన్న పనులన్నీ చేసి కాఫీ కూడా కలిపాడు. కాఫీ తాగుతున్నప్పుడు అడిగాడు.

"శాంతి వెళ్ళిపోయిందా?"

"అవును. నేనే పంపించాను."

"ఎందుకు పంపించేశావు? తను వెళ్ళి పోతే కష్టంకాదా? మనం ఎలా మేనేజ్ చెయ్యగలం?"

"ఎలాగో సర్దుకోవాలి. ఇంకో మనిషిని వెతుక్కోవాలి."

"ఉన్న మనిషిని వెళ్ళగొట్టి ఇంకెవరినో వెతుక్కోటమేమిటి?"

నేనేం మాట్లాడలేదు.

"ఇంతకూ ఏదో జరిగింది. నువ్వు నాకు చెప్పటం లేదు."

"మహా మీరన్ని విషయాలూ నాకు చెపుతున్నట్లు."

"ఏం చెప్పలేదంటావు?"

"ఇంకా నా నోటితో ఎందుకు చెప్పిస్తారు. మొన్న ఆదివారం జరిగిన విషయం అంతత్వరగా మరచిపోయారా?"

"ఏమిటది? ఓహో శాంతి విషయమా?"

రవి మొహంలో నవ్వు మాయమయి నెమ్మదిగా అన్నాడు. "నీకు చెప్పాలనుకొనీ చెప్పలేదు వసూ. పొరపాట్లు ఎవరైనా చేస్తారు. అంత చిన్న విషయానికి రాద్ధాంతం ఎందుకనుకొన్నాను."

"అది చిన్న విషయమా? ఆ మాట అనటానికి మీకు నోరెలా వచ్చింది? శాంతి పనిపిల్ల గనుక అది చిన్న విషయమయిందా? దానికి జీతమిస్తున్నంత మాత్రాన..."

"హోల్డాన్. లోకంలోని దుర్బుద్ధులన్నీ నాకు అంటగట్టకు. నీకు చెప్పాలను కొన్నాను గాని నువ్వు ఆవేశం కొద్దీ తనను పంపించివేస్తే మనకు కష్టమవుతుందని.."

"మనకా? లేక మీకు మాత్రమేనా? పెళ్ళయిన ఏడేళ్ళకి మగవాళ్ళ దృష్టి మరోవైపు మళ్ళుతుందంటారు. మీరూ చివరకు ఆ కోవలో చేరిపోయారు. మీ శృంగారానికి ఇంట్లోని పనిమనిషే దొరికిందా? మీ చేతి కింది మనిషి కదా. ఒంటరిగా ఉంది కదా నోరెత్తదులే అనుకొన్నట్టున్నారు."

"ఛీ... ఛీ... ఏమిటా మాటలు? ఎంత నీచంగా ఆలోచిస్తున్నావో, ఎంత తక్కువగా నన్ను అంచనా వేశావో నీ కర్థమవుతోందా? ఇంతకూ నేనేమి చేశానని? అసలు సంగతి తెలుసుకోకుండా నీ ఇష్టమొచ్చినట్లు వాగుతున్నావు?".

"వాగుడు? ఇది మీకు వాగుడులా ఉందా?

ఇంతకూ ఆ పరమ సత్యమేమిటో చెప్పారు కాదు."

"అంత వ్యంగ్యం అవసరం లేదు. నన్ను సూటిగా అడిగుంటే చెప్పేవాడిని. మనసులో పెట్టుకొని నిన్ను చిత్రవధ చేసుకొని నన్ను నానాహింసలూ పెడ్తున్నావు."

"సూటిగా అడుగుతున్నాను చెప్పండి మరి" అన్నాను అసహనంగా.

"మొన్న ఆదివారం సాయంకాలం నేనింటికి వచ్చేసరికి ఎక్కడా లైట్లు లేవు. గదులన్నీ చీకటి చీకటిగా ఉన్నాయి. లోపలి గదిలో క్యాండిల్ వెలుగుతోంది. తలుపు కొంచెంగా తీసి ఉంది. నేను లోపలికి వచ్చాను. అలమారాలోనుండి నీవేదో తీస్తున్నావు. ప్రేమగా వెనకనుండి చేతులు వేశాను. కెవ్వుమని ఇటు తిరిగింది శాంతి! తన చేతిలో నుంచి నీ రెండుపేటల గొలుసు జారి పడింది. ఇంతలో లైట్లు వెలిగాయి. ఒక్క పరుగులో తను అక్కడి నుండి వెళ్ళిపోయింది.

శాంతికి నీ చీర ఇచ్చినట్లున్నావు. దానితో పొరపాటు పడ్డాను. పొరపాటే కదా తను అర్థం చేసుకొందనుకొన్నాను.

ఆ స్థితిలో తను దొంగతనం చేస్తూ పట్టు పడిందని కూడా మరచిపోయాను. శాంతి నా గురించి నీకేమి చెప్పిందో నాకు తెలీదు. బట్ అయామ్ నాట్ గిల్టీ..."

నాకు నోట మాట రాలేదు.

"నన్నొక విలన్ కింద ఊహించుకొన్నావు. ఎంత స్త్రీ పక్షపాతమున్నా ఏక పక్ష నిర్ణయం తీసుకోకూడదు. పొరపాట్లు ఎవరైనా చేస్తారు. ప్రతి దానికీ బొమ్మా, బొరుసూ ఉంటాయి కానీ నీ నాణేనికి రెండు వైపులా బొరుసేనేమో!"

"ప్రస్తుతానికి అలాగే అనిపిస్తోంది."

"అంటే..."

నేనేం మాట్లాడలేదు. కొన్ని విషయాలకు జవాబు చెప్పక పోవటమే మంచిది.

(అక్టోబరు 1997)